ACCION FRATERNA ecology centre sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం

జూలై, 2009

FOR PRIVATE CIRCULATION ONLY

# మహోన్నత మానవునికి అశ్రునివాళి

'పరుల సేవలో శరీరాలు శిథిలమై నశించేవారు ధన్యులు' - వివేకానంద



తెలిసినవారు, ఆయనను ఒక్కసారి చూడనివారు సైతం ఆత్మీయంగా పిలుచుకునే "ఫాదర్ ఫెర్రర్" శెలవంటూ వెళ్ళిపోయారు. నలభై సంవత్సరాలుగా అనంతపురం జిల్లాకు ఆత్మగా మెలిగిన ఫాదర్, పేదలు, నిరక్షరాస్యులు, పీడితుల సేవను దైవసేవగా భావించిన ఫాదర్, జిల్లాలో లక్షలాది కుటుంబాల హృదిలో, మదిలో ఆత్మీయస్థానాన్ని సంపాదించుకున్న ఫాదర్ 19-6-2009 శుక్రవారం తెల్లవారుజామున 4-30 గంటలకు తుది శ్వాస విడిచారు. భాషవేరు, దేశం వేరు అయినా ఖండాంతరాలు దాటి వచ్చి ఈ ప్రజలతో జీవించి చివరికి ఈ మట్టిలోనే కలిసిపోయిన ఫాదర్ చిరస్మరణీయులు. ఒక్కడుగా ఈ దేశం వచ్చిన ఫాదర్ లక్షలాదిమంది ఆత్మీయులను సంపాదించి, చివరకు అందరని వదిలి వెళ్ళారు.

### ఫాదర్ ఫెర్రర్ జీవిత నేపథ్యం

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్పెయిన్ దేశంలోని బార్సిలోనాలో 1920న జన్మించారు. ఆయన స్పెయిన్ అంతర్యుద్ధంలో 1936లో సైన్యంలో చేరి 1939 వరకూ పని చేశారు. యుద్ధం ముగిసిన తర్వాత తన చదువును కొనసాగించాలని నిర్ణయించారు. స్పెయిన్‌లోని చాలా మంది పేదవారు న్యాయ సహాయం కోసం వకీళ్ళకు డబ్బులు ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతుండడం చూసి పేదలకు ఉచితంగా న్యాయ సహాయం చేయడానికి న్యాయ శాస్త్రం చదవడం మొదలు పెట్టారు. చదువు ముగిసిన తర్వాత, న్యాయవాదిగా సహాయం చేయగలగడం కంటే, చర్చి మతబోధకుడిగా దూర ప్రాంతాలలోని అన్నార్తులకు మరింత మెరుగైన సేవలు చేయగలనని భావించారు. దాని కారణంగా "సొసైటి ఆఫ్ జీసస్" అన్న సంస్థలో చేరి అక్కడ మత బోధకుడుగా శిక్షణ పొందారు. కఠినతరమైన పరిస్థితులలో, దుర్భర పరిస్థితులు ఏర్పడిఉన్న సామాజిక వాతావరణాల్లో సైతం, పరిస్థితులకు, ప్రతిబంధకాలకు, కష్టాలకు వెరవక ప్రజలకు సేవ చేసేటట్లుగా ఆ సంస్థలో శిక్షణనిచ్చి తీర్చిదిద్దుతారు. శిక్షణలో భాగంగా దుర్భరమైన పరిస్థితులలో బతుకుతున్న ప్రజల మధ్య చిల్లిగవ్వ చేతిలో లేకుండా వీరిని నెలల పర్యంతము వదిలివేస్తారు. వీరు ఆ ప్రజల్లో కలిసిపోవాలి. వారి తిండిని ఆ ప్రజల్లో పంచుకోవాలి. అటువంటి సంస్థలో శిక్షణ పొంది మతబోధకుడిగా 1952లో మన దేశం వచ్చారు. మహారాష్ట్రలోని బాగా వెనుకబడిన నాందేడ్ ప్రాంతాన్ని ఎన్నుకున్నారు. నాందేడ్ ప్రాంతంలో నిరుపేద రైతులు, వ్యవసాయ కూలీలు పడుతున్న దుర్భర దారిద్ర్య పరిస్థితులను చూసి చలించిపోయారు. అధిక వడ్డీలు, వెట్టి చాకిరీలలో బీద రైతులు నలిగిపోవడం చూసి వారికి అండగా ఉండాలని భావించారు. "మహారాష్ట్ర షేత్కారి సేవా మండల్" అనే సంస్థను స్థాపించారు. రైతులకు వ్యవసాయం జీవనాదాయంగానూ, గౌరవప్రదంగా ఉండాలని భావించి, రైతులకు వ్యవసాయ బావులు తవ్వించారు. ఆర్థిక వనరులు లేక తమ భూముల్ని సాగుచేసుకోకుండా బీడుగా ఉంచుకున్న దళితులు, వెనుకబడిన తరగతులవారి బీద రైతులకు సంస్థ ద్వారా సహాయమందించారు. వారు వ్యవసాయంలో నిలదొక్కుకోవడానికి చేయూతనందించారు. ఆయనందిస్తున్న సేవా ప్రయత్నాలు ఫలించాయి. ఫలితంగా రైతుల జీవితాలలో మార్పులు వచ్చినాయి. వారు వ్యవసాయ పెట్టుబడులకోసం ధనిక రైతుల వద్ద, షావుకార్ల వద్ద అప్పులు చేయడం తగ్గిపోయింది. అప్పుల కోసం అమానవీయ పద్ధతులలో ధనిక రైతులకు వెట్టి చాకిరీ చేయడం తగ్గిపోయింది. ఇతరుల మీద ఆధారపడకుండా బీద రైతులు స్వతంత్రంగా బతకడం నేర్చుకున్నారు. ఈ పరిణామాలు ఆ ప్రాంతాన్ని శాసిస్తున్న భూస్వాములకు, వడ్డీ షావుకార్లకు కంటగింపుగా మారింది. ప్రజలు తమ మీద ఆధారపడకుండా స్వతంత్రంగా, గౌరవంగా బతకడం వారికి నచ్చలేదు. ఫాదర్‌కు వ్యతిరేకంగా వారు ఆందోళన లేవదీశారు. ఫాదర్‌ను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫాదర్ వెళ్ళిపోవాలని మతఛాందసవాదులు, భూస్వామ్య వర్గాలు ఆందోళన చేస్తే, ఫాదర్‌కు మద్దతిస్తూ అభ్యుదయ వాదులు, సామాన్య ప్రజలు ముంబాయి, పూణె, నాసిక్‌లలో ర్యాలీలు నిర్వహించారు. చివరికి మహారాష్ట్ర ప్రభుత్వం పలుకుబడి వర్గాలకు తలొగ్గి 1968లో ఫాదర్ దేశం విడిచి వెళ్ళిపోవాలని ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా గొప్ప ప్రజా ఉద్యమం మొదలయింది. మతఛాందసవాదుల అభిప్రాయాలతో ఏకీభవించే పత్రికలు ఫాదర్‌కు వ్యతిరేకంగా వార్తలు రాస్తే, సామాజిక న్యాయం కోసం విలువనిచ్చే పత్రికలు ఫాదర్‌కు మద్దతునిచ్చాయి. ఫాదర్ ప్రభుత్వానికి ఒకే ఒక ప్రశ్న వేశారు. అది ఏమంటే "నన్ను దేశం వదలిపొమ్మనడానికి, నేను చేసిన తప్పేమో చెప్పండి, నేను వెళ్లిపోతాను" అని. ఫాదర్ ఫెర్రర్‌కు మద్దతుగా ఎంతోమంది అభ్యుదయవాదులు, రైతులు, రైతు కూలీలు ఆందోళన మొదలుపెట్టారు. ఈ దశలో స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీగారు ఫాదర్‌ను పిలిపించుకొని మూడు నెలలు దేశం వదిలి తిరిగి రమ్మని సలహా ఇచ్చారు. ఫాదర్ మూడు నెలల పిమ్మట తిరిగి ఇండియా వచ్చారు.

### సిస్టర్ ఆన్ పరిచయం

సిస్టర్ ఆన్ ముంబాయిలో జర్నలిజం పూర్తి చేశారు. ఆ తరువాత "ది కరెంట్" అన్న ఆంగ్ల వార పత్రికలో జర్నలిస్టుగా చేరారు. ఫాదర్‌ను, ఫాదర్ సేవా కార్యక్రమాలను సమర్థిస్తున్న పత్రికల్లో అదొకటి. ఈవాద ప్రతివాదాల్లోని వాస్తవాలను ప్రత్యక్షంగా చూడాలనుకున్న సిస్టర్, ఆ నాందేడ్ ప్రాంతంలోని సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల జీవితాల్లో వచ్చిన మార్పులను చూసి ముగ్ధులయ్యారు. తను కూడా ఫాదర్ సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలనుకున్నారు. ఆ రోజుల్లో ఫాదర్‌కు వ్యతిరేకంగా చేస్తున్న ప్రధాన ఆరోపణ ఫాదర్ మత మార్పిడులు చేస్తున్నారని. దానికి సమాధానంగా ఫాదర్ →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

“నేను ప్రజలతో ఏ ఒక్క సందర్భంలోనూ బీదవారితో దేవుడి గురించి మాట్లాడలేదు. దేవుని కంటే వారి ఆకలి సమస్యలు నాకు ప్రధానంగా తోచాయి” అని అన్నారు. బహుశా ఈ కారణంగానే సొసైటీ ఆఫ్ జీసస్ సంస్థ నుంచి ఫాదర్‌ను వెలివేశారని ఫాదర్ మరణించిన తర్వాత నివాళులు అర్పిస్తూ ఒక స్పెయిన్ దేశపు పత్రిక రాసింది. అంతవరకు సహాయమందిస్తున్న క్రిష్టియన్ ధార్మిక సంస్థలు ఫాదర్ చేస్తున్న కార్యక్రమాలకు సహాయమందించడం ఆపి వేశాయి. ఫాదర్ కలత చెందలేదు.

ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారు ఈ రాష్ట్రానికి ఆహ్వానించారు. హైదరాబాదులో ఒక జర్నలిస్టు మిత్రుడు రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో కూడా అత్యంత వెనుకబాటుకు గురవుతూ, నిత్యం కరువు కాటకాలకు గురవుతున్న అనంతపురం జిల్లాను తన సేవా కార్యక్రమాలకు ఎంచుకోవాలని సూచించారు. దానితో సిస్టర్‌తో కలిసి ఫాదర్ అనంతపురం పయనమయ్యారు. అనంతపురంలో అడుగుపెట్టడంతోనే “ఫాదర్ గో బ్యాక్” అన్న రాతలు గోడలమీద దర్శనమిచ్చాయి. సమస్యలొస్తాయని జంకి, అనంతపురంలోని ఏ లాడ్జి యజమానులు కూడా ఫాదర్‌కు ఆశ్రయమివ్వలేదు. మేధావులకు, వామపక్ష నాయకులకు వేదికగా ఉండిన ఆరాం హోటల్ యాజమాన్యం ఫాదర్‌కు గదులు అద్దెకిచ్చింది. 1970లో ఫాదర్, సిస్టర్ అన్నే వివాహం చేసుకున్నారు.

## అనంతపురం జిల్లాలో కొనసాగిన ఫాదర్ ప్రస్థానం

జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన కళ్యాణదుర్గం ప్రాంతాన్ని ఫాదర్ తన సేవా కార్యకలాపాలకు కేంద్రంగా ఎంచుకున్నారు. నల్ల రంగు ప్యాంటు, సైను బనియనుతో అతి సామాన్యంగా ఫాదర్, సిస్టర్‌తో కలిసి కాలినడకన గ్రామ గ్రామన తిరిగారు. బీద రైతులు, దళితులు, గిరిజనుల దుర్భర జీవన పరిస్థితుల గురించి చలించిపోయారు. వరుస కరువులు బీద రైతులను ఎలా పీల్చి పిప్పి చేస్తున్నాయో గమనించారు. అంతవరకూ ఫాదర్ సేవా కార్యక్రమాలకు అండగా ఉంటున్న ధార్మిక నిధుల సంస్థలు కూడా ఫాదర్‌కు సహాయం చెయ్యడం లేదు. స్పెయిన్‌లో ఈసరికే ఆయన సేవా కార్యక్రమాల గురించి తెలిసింది. స్పెయిన్‌లోని మిత్రులను ధార్మిక గుణాలున్నవారిని కలిశారు. జార్జియా సమాచార స్నేహితుల బృందం పేరు మీద, ఫాదర్‌కు చేయూతనిచ్చారు. స్పెయిన్‌లోని రాజకీయ వ్యవస్థలను, వ్యక్తులను, సంస్థలను ఫాదర్ ఫెర్రర్ ప్రభావితం చేయగలిగారు. అనంతపురంలో రాయలసీమ అభివృద్ధి సంస్థను స్థాపించారు. మరి కొంత కాలానికి గ్రామీణాభివృద్ధి సంస్థను (ఆర్.డి.టి.) స్థాపించారు. జిల్లా వెనుకబాటు తనం బయటపడడానికి ప్రజల జీవన స్థితిగతులలో మార్పు రావడానికి విద్య, వైద్యం ఎంతో అవసరమనుకున్న ఫాదర్ విద్య, వైద్య వ్యవస్థలను పటిష్టపరిచారు. దాదాపు 1059 పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాలు నిర్మించారు. శారీరక వైకల్యం కలిగిన వారిపట్ల ప్రత్యేక శ్రద్ధవహిస్తూ, వారి కోసం 16 ప్రాథమిక పాఠశాలలు నిర్మించి వారికి పునరావాసం కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంత బాలురకు క్రీడల పట్ల మక్కువను కలిగిస్తూ, క్రీడా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, 54 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక స్టేడియంను నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల వారికి వైద్య సహాయం అందించడానికి ఆధునిక హంగులతో వైద్యశాలలు నిర్మించారు. ప్రతి ఏటా ప్రతిభావంతులైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రతిభవున్నా ఉన్నత విద్య అందని ద్రాక్షపండులాగా ఉన్నటువంటి తరుణంలో ఎందరో పిల్లలు, ఇంజనీరింగ్, వైద్య విద్యను అభ్యసిస్తూ ఉన్నారు. 40 సంవత్సరాల క్రితం ప్రాథమిక విద్యకు సైతం నోచుకోకుండా దూరంగా ఉన్న దళిత, గిరిజన, వెనుకబడిన వారి పిల్లలకు అనుబంధ పాఠశాలలు ఏర్పాటు చేసిన కారణంగా ఆ పాఠశాలల్లో చదువుకున్న పిల్లలు ఈ రోజు ఉన్నత విద్యను చదివి సామాజిక గౌరవంతో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. రైతులకు పాడి పరిశ్రమకు, వ్యవసాయ వనరులను పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. పేద ప్రజలకు స్వంత ఇళ్ళు మానసిక ధైర్యాన్ని కలిగిస్తాయని వారికి స్వంత ఇళ్లుండాలని మహిళల పేరు మీద దాదాపు 28వేల ఇళ్ళు నిర్మించి ఇచ్చారు.

## ఫాదర్‌ను వరించిన అవార్డులు

అనంతపురం జిల్లాలో ఆర్థిక అసమానతల్ని రూపుమాపేందుకు ఫాదర్ ఫెర్రర్ నిశ్శబ్ద విప్లవాన్ని తెచ్చారని ప్రశంసిస్తూ, స్పెయిన్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత గౌరవ పురస్కారం “లాగ్రాన్ క్రూజ్ డేల్ మెరిటో సివిల్” ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో ఆ దేశ ఉప ప్రధాని స్వయంగా ఇక్కడికి వచ్చి ఫాదర్‌కు బహూకరించారు.

- **1998లో ప్రిన్స్ ఆఫ్ స్పెయిన్ అవార్డు.**
- **యూనివర్సిల్ మాన్ ఆఫ్ పీస్, 1998.**
- **2007లో గోల్డ్ మెడల్ సిటీ ఆఫ్ బార్సిలోనా.**
- **2000లో “కాటలాన్ ప్రభుత్వం క్రాస్ ఆఫ్ సెయింట్ జార్జి” అవార్డు ప్రదానం.**
- **2001లో వాలెన్‌సియా యూనివర్శిటి నుంచి గౌరవ డాక్టరేట్.**
- **స్పెయిన్ ప్రభుత్వం గోల్డెన్ క్రాస్ అవార్డు ప్రదానం.**
- **20 శతాబ్దపు యునెస్కో అవార్డు “చరిత్ర ప్రముఖ వ్యక్తి” అవార్డు ప్రదానం.**
- **స్పానిష్ ఒలంపిక్ స్పిరిట్ ప్రైజ్, 2002.**
- **శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటి ద్వారా డాక్టరేట్.**

## విలక్షణ వ్యక్తిత్వం

ఫాదర్ ఫెర్రర్ ఏ ఒక్క మనిషి మీద కోపం ప్రదర్శించలేదు. ఆయన ఎదుట మూర్ఖత్వం ప్రదర్శించిన వారిని సైతం క్షమించి వారిని గౌరవించిన అసాధారణ వ్యక్తిత్వం ఫాదర్‌ది. సమాజంలో విలువ పొందిన వ్యక్తితో ఎంత ఆత్మీయంగా మాట్లాడేవాడో, అతి సామాన్య వ్యక్తితో సైతం అత్యంత గౌరవంగా మాట్లాడే మనస్తత్వం ఫాదర్‌ది. సంస్థ సేవా కార్యకలాపాలన్నింటినీ ప్రచారానికి, హంగులకు, ఆర్భాటాలకు దూరంగా ఉంచాలని కోరేవారు ఫాదర్. ఏ వ్యక్తికైనా ఏ సంస్థకైనా కాలం గడుస్తున్న కొద్దీ వ్యతిరేకులు ఎక్కువ అవడం సామాజిక ధర్మం. కానీ ఫాదర్ విషయంలో మాత్రం మొట్టమొదట అర్థం చేసుకోకుండా ఫాదర్‌ను వ్యతిరేకించినవారు సైతం మిగతా ప్రజలతో సమానంగా ఫాదర్‌ను ఆత్మీయంగా గౌరవించబడ్డ విలక్షణ వ్యక్తిత్వం ఫాదర్‌ది. “ప్రేమతో రాయినైనా కరిగించగలం” అన్న ఖురాన్ సూక్తిని ఫాదర్ ఆచరణలో చూపారు. దరిద్రులు, మూర్ఖులు, అజ్ఞానులు, పీడితులను ప్రత్యక్ష దైవాలుగా భావించాలన్న వివేకానందుని సూక్తులను ఆయన నిజం చేశారు. అన్నింటి కంటే ముఖ్యంగా సమాజ మార్పు, పరివర్తన, అభివృద్ధి సంఘర్షణ ద్వారానే సాధ్యమవుతాయన్న సామాజిక తత్వవేత్తల అభిప్రాయాలకు భిన్నంగా శాంతి, సహనం, సేవల ద్వారా సాధించవచ్చునని 21వ శతాబ్దంలో రుజువు చేసిన మహామనిషి ఫాదర్ ఫెర్రర్. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, మారుమూల ప్రాంతం అనంతపురం జిల్లాలో సేవలందిస్తూ ఖండాంతరాల ఖ్యాతిని స్వంతం చేసుకున్నారు ఫాదర్. అశ్రునయనాలతో ఆయన అంతిమ యాత్రకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజల అభిమానం ఫాదర్‌ను చిరంజీవిగా మార్చివేసింది.

“విన్సెంట్ ఫెర్రర్‌గారి జీవితం, పరులకోసం ఆయన పడిన తపన గొప్ప ఉదాహరణలుగా నిలుస్తాయి. సమాజంలోని అభాగ్యుల పట్ల ఆయన చూపిన

ప్రేమ, సేవా భావం, వారి అభివృద్ధి కోసం పడిన శ్రమ మరచిపోలేనటువంటివి. విన్సెంట్ ఫెర్రర్ ! నీవు మరణించినా మా గుండెల్లో పదిలంగానే ఉంటావు" అని జార్జియా సమాచార స్నేహ బృందంవారు స్పెయిన్‌లో సంతాపం ప్రకటించారు. ఈనాడు స్పెయిన్‌లోని మాడ్రిడ్ ఇతర పట్టణాల్లో చాలా వీధులకు ఫాదర్ పేరును పెట్టి గౌరవిస్తున్నారు. యూరప్ దేశంలో ఆయనను "సాన్ విన్సెంట్ ఫెర్రర్" అని గౌరవంగా పిలుచుకుంటున్నారు. సాన్ అంటే సెయింట్ లేదా రుషి అని అర్థం. ఫాదర్ ఆయన జీవితకాలంలో చెప్పిన మాటలు చిరకాలం గుర్తుంటాయి. "ఈ ప్రపంచంలో ఎవరు ఏ మంచి పని చేసినా ఎక్కడో ఒక చోట దాని ఫలితాలు నిలిచిపోతాయన్న విశ్వాసం నాకుంది" అనేవారు. ఫాదర్ ఫెర్రర్ బాగా చదువరి. సమకాలీన ప్రజల సంస్కృతుల్ని అధ్యయనం చేసినవారు. ప్రపంచంలోని ప్రజలు ఎవరు ఏ మత విశ్వాసాలకు చెందినా, మానవులందరి జీవిత గమ్యం ఒకటే అని నమ్మినవాడు. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించినవాడు. చరిత్రలో మానవ సంతతి ఉద్భవించిన నాటి నుండి, సమాజాన్ని మానవీయంగా మలచడానికి, ప్రేమ, దయా సుగుణాలతో అభివృద్ధి చెందడానికి మానవుడు శ్రమిస్తూనే ఉన్నాడని ఆయన చెప్పేవారు. మన (సంస్థ) చేస్తున్న కార్యక్రమాలు అన్నీ ఇందులో భాగమేనని చెప్పి, మన కార్యక్రమాలు వ్యక్తులతో, కాలంతో నిమిత్తం లేకుండా కొనసాగుతూనే ఉండాలి అని ఆకాంక్షించారు. "ఈ ప్రాంతాన్ని చూచి నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఎప్పుడు ఈ ప్రాంతంలోని నేలలు ఉద్యానవనాలుగా మారుతాయి ? అలా మారిన ఉద్యానవనాలు ఎప్పుడు ఈ ప్రజలకు సుఖమయ జీవితాన్నిస్తాయి ? దీన్ని సాధించాలని నాకు నేను ప్రతిజ్ఞ చేసుకున్నాను" అని చెప్పేవారు.

35 సంవత్సరాలుగా ఫాదర్‌లాంటి మహోన్నత వ్యక్తితో కలిసి పని చేయగల అవకాశం నాకు జీవితంలో లభించిన గొప్ప వరం. గురువు, మార్గదర్శి, తండ్రి లాంటి ఫాదర్ భౌతికంగా లేని లోటు ఊహకు అందనిది. ఆయన ప్రదర్శించిన మానవీయత అఖండ జ్యోతుల్లాగా మనకు దారి చూపుతూనే ఉంటాయి. ఫాదర్ మాటలు ఈ విధంగా చెవుల్లో గింగురుమంటూనే ఉంటాయి.

- *ఇతరుల గురించి ఆలోచించడం, ఇతరుల కోసం పని చేయడం.*
- *ఒక సోదరుని మాదిరి మెలగక పోతే మనిషి మనిషి అనిపించుకోడు. ఇతరుల కోసం పాటుపడే వాడే నిజమైన సోదరుడు. ఎంత చేతనైతే అంత సహాయం అందివ్వు. మానసికంగా నిన్నుమించిన సంతోషకారి ఉండడు.*
- *ప్రతి మనిషికి విలువ, గౌరవం ఉంటాయి. వాటిని గౌరవించు.*
- *ప్రతి ప్రాణి పవిత్రతను గౌరవించు.*
- *మానవ అభివృద్ధి ప్రస్థానంలో నీ చోటు వెతుక్కో.*
- *సత్యం పలకాలి.*
- *ఇతరులకు హాని కలిగించకు.*
- *ఓ అవసరం ఉన్న వారికి, సహాయమందించు. బాధల్లో ఉన్నవారికి స్వాంతన చేకూర్చు.*

**"తన కోసం బతికేవాడు బతుకుతూ మరణిస్తాడు.**
**పరుల కోసం బతికేవాడు మరణించి కూడా బతుకుతాడు"**

అంతటి మహనీయునికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం, అశ్రు నివాళులు అందించడం తప్ప.

బాధాతప్త హృదయాలతో...

**డా॥ వై.వి. మల్లారెడ్డి**
**డైరెక్టర్, ఎకాలజి సెంటర్**

# వాతావరణ మార్పులకు తట్టుకునే వంగడాన్ని అభివృద్ధిపర్చిన "ఇక్రిసాట్"

వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రపంచం వేడెక్కిపోతోంది. దాని మూలంగా మెట్ట భూములు మరింత వేడికి గురవుతూ ఉండడం మూలంగా రైతులు వీటిలో పంటలు తీయడం కష్టంగా మారుతూ ఉంది.

## అభివృద్ధి పర్చిన వంగడాలు

ఇక్రిసాట్, దాని భాగస్వామ్య సంస్థలు కలిసి వాతావరణ మార్పుల దుష్ప్రభావాలకు తట్టుకునే వంగడాలు అభివృద్ధి చేశాయి. ఇవి ఒరుపులకు, అధిక వేడిమికి తట్టుకుంటాయి. తక్కువ సమయంలోనే కోతకు వస్తాయి. దీని ద్వారా రైతులకు వాతావరణ మార్పుల దుష్ప్రభావాల్ని ఎదుర్కొనగలిగే సామర్థ్యం ఏర్పడుతుంది.

ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డా॥ విలియమ్ దార్, ప్రకారం, వేడిమిని తట్టుకోగల, వరుపులకు తట్టుకోగల వంగడాలను అభివృద్ధి చేసే లక్ష్యంగా ఇక్రిసాట్ సంస్థ ప్రయోగాలు సాగుతున్నట్లుగా తెలుస్తున్నది.

## మెట్ట భూములకు అవసరమైనవి

సద్దలు, జొన్నలు, పప్పుశెనగ, కందులు, వేరుశెనగ పంటలు ఇక్రిసాట్ పరిశోధనల లక్ష్యంగా ఉంది. మెట్ట ప్రాంత రైతుల బతుకు తెరెవులకు ఈ పంటలు ప్రధానమైనవి.

భూమండలం వేడెక్కె ప్రక్రియలో అభివృద్ధి చెందడానికి కావలసిన సామర్థ్యం ఈ పంటలలో సహజసిద్ధంగా ఇమిడి ఉండడం ఒక మంచి అవకాశం.

సద్దలు, జొన్నలు రెండూ కూడా భూమిలో చౌడు స్వభావానికి బాగా తట్టుకునే సామర్థ్యం కలవి. కనుక భూమండలం వేడెక్కె ప్రక్రియతో చౌడు భూములుగా మారుతున్న పంట భూములకు ఈ రెండు రకాలు చాలా అనుకూలమైనవి.

సద్దలలో అభివృద్ధి చేసిన కొన్ని వంగడాలు, హైబ్రిడ్ రకాలు వాతావరణంలో 42 సెంట్రిగ్రేడ్ ఉష్ణం కంటే అధికంగా ఉండే పశ్చిమ రాజస్థాన్, గుజరాత్‌లలో నూగువేసి, విత్తనం అభివృద్ధి చెందే సామర్థ్యం కలిగి ఉన్నాయి.

## మంచి దిగుబడులు

అభివృద్ధి చేసిన జొన్న వంగడాలు కూడా 42 సెంటిగ్రేడ్ వేడి వాతావరణంలో కూడా మంచి దిగుబడులు ఇవ్వగలవు. భూమిలో తేమ తగ్గినప్పటికీ, పైరు పచ్చగా ఉంటూ ఒరుపులకు తట్టుకునే గుణం కలిగి ఉంటాయి.

తక్కువ రోజుల వేరుశెనగ రకాలైన (ICGV 9114) కూడా ఒరుపులకు బాగా తట్టుకోగలదు. ఈ సరికే పాత వేరుశెనగ రకాల స్థానంలో ఇది ప్రాచుర్యాన్ని పొందుతూ వుంది.

పప్పుశెనగలో ఇక్రిసాట్ అదనంగా తొందరగా వచ్చే రకం (85 నుండి 90 రోజుల పంట కాలం) మరింత తొందరగా వచ్చే రకం (75 నుండి 80 రోజుల పంట కాలం) అభివృద్ధి చేశారు. దీని ద్వారా వర్షాభావ పరిస్థితులను అధిగమించే సౌలభ్యం ఉంటుంది.

ఇటీవలనే ఇక్రిసాట్ పరిశోధకులు మరొక పప్పుశెనగ రకాన్ని కనుగొన్నారు. ఇది వేడి తట్టుకోగలిగే స్వభావంతోపాటు బుడ్డల్లో గింజలు అభివృద్ధి చెందే దశలో అధిక వేడి వాతావరణానికి తట్టుకుని నిలబడగలదు.

అదనపు సమాచారం కొరకు డా॥ సి.యల్.యల్.గౌడ, గ్లోబల్‌థీమ్ లీడర్ ఫార్ క్రాప్ ఇంప్రూవ్‌మెంట్, ఇక్రిసాట్, హైదరాబాదుకు వ్రాయండి.

e-mail : c.gowda@cgiar.org (హిందూ 11-06-2009 నుండి)

# సుస్థిర వ్యవసాయంలో రాజీలేని సూత్రాలు

కొన్ని విషయాలలో ఏమాత్రం రాజీపడకుండా అనుసరించే పద్ధతులను మనం రాజీలేని సూత్రాలంటూ వ్యవహరిస్తున్నాం. ఇవి పూర్తిగా పాటించడంలోనే రాజీలేని సూత్రాల ప్రయోజనం ఇమిడి ఉంది. 1) వేసవి దుక్కులు, 2) సరిహద్దు పంటలు, 3) ఎరపంటలు, 4) అంతర పంటలు, 5) పసుపు పచ్చని డబ్బాలు, 6) తెల్లని డబ్బాలు, 7) లింగాకర్షక ఎరలు, 8) పక్షి స్థావరాలు, 9) వరిలో కాలిబాటలు, 10) వరినారు మడులలో సుడులు కత్తిరించడం. వీటిని మనం నిత్యం మననం చేసుకుంటూ ఉండాలి. వీటివల్ల ప్రయోజనాలేమిటో, ఎందుకు పాటించాలో తెలుసుకుందాం. తక్కువ ఖర్చుతో వ్యవసాయానికి మనం పూనుకుంటున్నాం. వివిధ దశలలో ఇతర సేంద్రీయ వ్యవసాయ విధానాలను కూడా మనం ఉపయోగించుకున్నా మూలసూత్రాలైన రాజీలేని సూత్రాలను అతి ముఖ్యమైనవిగా మనం భావించాలి.

**1. వేసవి దుక్కులు :-** గ్రీష్మరుతువులో విపరీతమైన ఎండలు కాస్తాయని మనకందరికీ తెలుసు. చాలా పురుగులు భూమిలో బొరియలు చేసుకుని వెళ్ళి గుడ్లు పెడతాయి. మరికొన్ని పురుగులు భూమిలోపల నిద్రావస్థలో ఉంటాయి. వేసవి కాలంలో లోతుగా దున్నడంవల్ల ఈ పురుగుల ప్యూపాలు చాలావరకు బయటపడి ఎండలకు మాడిపోతాయి. కొన్ని పక్షులకు ఆహారమవుతాయి. తలనత్తపురుగు, పచ్చపురుగు, పొగాకు లద్దెపురుగు, గులాబిరంగు పురుగు, ఎర్రగొంగళి పురుగు, వేరుపురుగు, దాసరిపురుగులు లాంటివి ముఖ్యమైనవి. తొలకరి వర్షం పడి భూమిలోపలికి తేమ ప్రవేశించడంతోనే ఇవి అన్నీ రెక్కల పురుగులు రూపంలో బయటికి వస్తాయి. పంటలకు అనేక నష్టాలు కలుగచేస్తాయి. పురుగులు విజృంభించిన తరువాత వాటిని అరికట్టడంలో విఫల ప్రయత్నం చేసి పంటలను నష్టాల పాలు చేసుకోవడంకన్నా, మొగ్గలోనే వీటిని తుంచే ప్రయత్నం చేస్తే మంచిది కదా ! గొంగలిపురుగు వేరుపురుగు వేరుశనగ పంటలో ఎంత నష్టాన్ని కలుగజేస్తాయో మనకందరికీ అనుభవముంది. ప్యూపాలను నివారించడమే కాకుండా, భూమి దున్నడం వలన భూమి గుల్లబారి వర్షపునీటిని ఎక్కువగా గ్రహిస్తుంది.

**2) సరిహద్దు పంటలు :-** ప్రతి ప్రధాన పంటను కాపాడుకోవడానికి సద్ద జొన్నలాంటి ఎత్తుగా పెరిగే పంటల్ని సరిహద్దు పంటలుగా వేస్తే బయటినుంచి వచ్చే పురుగులు ఆకర్షితమై సరిహద్దు పంటమీదే వాలుతాయి. ప్రధాన పంటకు రక్షణగా ఉంటుంది. పశువుల మేతగా కూడా ఉపయోగపడుతుంది. పంట కూడా వస్తుంది. ప్రధాన పంటసాలుకు అడ్డంగా సరిహద్దు పంటవేయడం వలన వర్షం నీరు బయటికి వెళ్ళకుండా సహాయపడుతుంది. గత సంవత్సరం సరిహద్దు పంట వేసిన పొలాల్లో వేరుపురుగు కూడా బాగా తగ్గింది.

**3) ఎరపంటలు :-** పంటలకు హాని చేసే పురుగులు ప్రధాన పంటను నష్టపర్చకుండా ఎరపంటలు వేయాలి. అలసంద, పెసలు, సోయాచిక్కుడు ఆముదము లాంటివి వేసుకోవడంవలన పచ్చపురుగు, పొగాకు లద్దె పురుగు వాటిని ఎరపంటలు ఆకర్షిస్తాయి. ఎర్రగొంగళి పురుగుకు జిల్లేడు, అడవి ఆముదం లాంటివి ఉపయోగపడుతాయి. వేరుపురుగుకు ఎరపంటగా జనుము ఉపయోగపడుతుంది.

**4) అంతర పంటలు :-** ప్రతి పంటలో వైవిధ్యమైన పంటలుండడం అత్యంత అవసరం. జొన్న, కంది, అలసంద, పెసలు, నువ్వులు లాంటివి అంతర పంటలుగా వేసుకోవడంవల్ల ఏ పంటను ఆకర్షించే పురుగులు ఆ పంటలనే ఆకర్షిస్తాయి. ప్రధాన పంటమీద బరువు తగ్గుతుంది. ముఖ్యంగా బహుళ పంటలుగా పప్పుధాన్యాలు పండించడంవల్ల ఆహార భద్రత పోషకాహారం కూడా లభ్యమవుతుంది.

**5) పసుపు పచ్చని డబ్బాలు :-** డబ్బాలు లేక పళ్ళాలు ఏవి వీలయితే అవి అనుకూలంగా అమర్చుకోవచ్చు. పసుపు రంగు పూసిన డబ్బాకు చుట్టూ జిగురులాంటిది లేదా గ్రీజు పూసి ఎకరాకు 5 చొప్పున అమర్చాలి. తెల్లదోమ తల్లి పురుగులు ఆకర్షితమై పైకి ఎగరకుండా అంటుకుపోతాయి. చివరకు చనిపోతాయి. ఈ రకంగా ఎలాంటి ఖర్చులు లేకుండా ఈ పురుగును అదుపు చేయవచ్చు. తెల్లదోమ తల్లి పురుగులు ఎర్రని పచ్చని శరీరం తెల్ల రెక్కలు కలిగి సున్నితంగా ఉంటాయి. ఇవి పసుపు రంగులో ఆకుల అడుగు భాగాన గుడ్లు పెడుతాయి. తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడంవలన ఆకులు రాలిపోతాయి. పత్తి, టమోటోలలో ఆకుముడత తెగులు, బెండలో వెర్రితెగులు వ్యాపింపచేస్తుంది. ఏమాత్రం శ్రమ, ఖర్చు లేకుండా పురుగులను అదుపు చేసుకునే ఉత్తమమైన మార్గం ఇది.

**6) తెల్లని డబ్బాలు :-** పై విధంగానే గ్రీజు రాసిన తెల్ల డబ్బాలు ఎకరానికి 5 చొప్పున పొలంలో అక్కడక్కడా ఉంచాలి. తెల్ల రంగుకు ప్రధానంగా తామర పురుగు తల్లి పురుగులు ఆకర్షితమవుతాయి. తామరపురుగులు గోధుమ రంగులో చిన్నవిగా పసుపు రంగులో ఉంటాయి. ఇవి చీలిన రెక్కలతో ఈనెల మధ్య దాగిఉంటాయి. ఆకుల అడుగు భాగంలో గుడ్లు చొప్పించి పెడుతాయి. పిల్ల, పెద్ద పురుగులు ఆకుల అడుగుభాగాన గీకి రసాన్ని పీల్చడంవల్ల ఆకుల అడుగు భాగంలో వెండి రంగులో మెరుస్తూ కన్పిస్తాయి. పురుగు రసం పీల్చిన భాగాలు ముడుచుకుపోయి కప్పుల్లా మారుతాయి. మొక్క గిడసబారుతుంది. ఇవి కొన్ని పంటలలో వైరస్ తెగుళ్ళను వ్యాపింపజేస్తాయి. జొన్న, మొక్కజొన్న పంటలలో పంట మార్పిడి చేయడంవల్ల కూడా ఈ పురుగు ఉధృతి తగ్గుతుంది.

**7) లింగాకర్షక ఎరలు / బుట్టలు :-** ప్రతి ఆడ రెక్కల పురుగు మగ రెక్కల పురుగును ఆకర్షించడానికి ఒకరకమైన వాసన విడుదల చేయడంద్వారా రసాయనిక సంకేతం ఇస్తుంది. ఆ వాసన ఎక్కడి నుండీ వస్తోందో కనుగొంటూ మగ పురుగు అక్కడికి చేరుతుంది. లింగాకర్షక రసాయనం ఒక ఎరలో పెట్టి పొలంలో అమర్చినపుడు మగ పురుగు ఆడపురుగు అని భ్రమపడి ఎరలో చిక్కుకుపోతుంది. ఈ రసాయనం ఒక్కో రకం పురుగును బట్టి మారుతూ ఉంటుంది. ఒక రకపు పురుగు రసాయనం మరొక రకపు పురుగులను ఆకర్షించలేదు. ఈ పద్ధతి ద్వారా అన్ని రకాల పురుగులను నివారించలేము. ఉదాహరణకు పచ్చపురుగు సుమారు 200 రకాల మొక్కలను ఆశిస్తుంది. ఎక్కువగా పురుగులు ఎరల్లోకి పడుతున్నాయంటే అవి గుడ్లు పెట్టే ప్రయత్నంలో ఉన్నాయని అర్థం చేసుకుని తగిన నివారణ చర్యలు చేపట్టాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకొని పచ్చపురుగు ఉధృతి కనుక్కోవచ్చు. పత్తి, వేరుశనగ, మిరప, టొమోటో, ప్రొద్దుతిరుగుడు, కంది లాంటి పంటలు నష్టపోకుండా కాపాడుకోవచ్చు. ఇవి ఆకులను తిని జల్లెడగా మారుస్తాయి. ఆముదం ఆకులమీద వీటి ప్రభావాన్ని బాగా గమనించవచ్చు. వరిలో కాండం తొలుచు పురుగుకు కూడా లింగాకర్షక ఎరలు పెట్టవచ్చు. మొవ్వకుళ్ళు, తెల్లకంకి నష్టాల్ని అరికట్టవచ్చు.

**8) పక్షిస్థావరాలు :-** పక్షులు రైతులకు నిజమైన మిత్రులు. పొలంలో పక్షులు వాలడానికి అనువైన చెట్లు ఉన్నప్పుడు పక్షులు చెట్లపై వాలి భూమిమీద ఉన్నటువంటి పురుగులను ఏరి తింటాయి. ఆ రకంగా, పురుగులను నియంత్రిస్తాయి. ఇపుడు పొలాల్లో చెట్లుండవు కాబట్టి పక్షులు వాలడానికి ప్రత్యేకంగా నిర్మించేవే పక్షి స్థావరాలు. 5-6 అడుగుల కర్రకు పైభాగాన అడ్డంగా 2-3 అడుగుల కర్రను కడితే అదే పక్షి స్థావరమవుతుంది. దీనికోసం ప్రత్యేకంగా ఖర్చుపెట్టాల్సిందేమీ లేదు. పనికి రాని కర్రలు ఎక్కడైనా దొరుకుతాయి. ఎకరానికి కనీసం పది పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం మంచిది. రసాయనిక పురుగు మందులు వాడడం మానివేస్తే, మిత్రపురుగులు అభివృద్ధి చెందుతాయి. పక్షులు కూడా పొలంలో వాలుతాయి. పక్షుల్ని ఎక్కువ సేపు పొలంలో ఉండేటట్లు ఏర్పాట్లు చేయాలి. అపుడు అవి అనేక రకాల కీటకాలను, లార్వాలను ఏరి తింటాయి. ఈ కర్రలను పంట గింజకట్టే దశలో తీసివేయాలి. ఇవి అవీ అంటూ తేడా లేకుండా అన్నిరకాల పరుగులను పక్షులు ఏరి తింటాయి. కాబట్టి అవి అన్ని పంటలకూ ఉపయోగపడతాయి.

**9) కాలిదోవలు :-** వరిపంటలో ప్రతి రెండు మీటర్లకు కాలి దోవలు ఏర్పాటు చేయడం మూలంగా గాలి విసిరి సుడిదోమ అరికట్టబడుతుంది. సుడిదోమ తల్లి, పిల్ల పురుగులు వరి మొక్కల మొదళ్ళ దగ్గర చేరి నీటిమట్టానికి కొంచెం ఎత్తులో కాండం నుంచి రసం పీల్చడం మూలంగా, వరి ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోతాయి. ఈ విధంగా పొలంలో అక్కడక్కడా వృత్తాకారంగా ఎండిపోయి ఉంటాయి. కాలిబాటలు ఏర్పాటు చేయడంవల్ల, గాలి స్వేచ్ఛగా వరి కయ్యలలోకి ప్రవేశించి పురుగు ఉధృతి అరికట్టుతుంది.

**10) సుడులు తెంపడం :-** వరిపంటలో కాండం తొలుచుపురుగును అరికట్టడానికి ఈ పద్ధతిని అవలింబించాలి. నారుపీకి నాటుకునే దశలో నారు సుళ్ళు కొసల్ని తెంచి వేయాలి. దీనికి కారణం ఆకుపైభాగం చివర్లో కాండం తొలుచు పురుగు వరి మొక్కల కొసళ్ళలో 150-200 దాకా గుడ్లు పెట్టి నూగుతో కప్పుతాయి. కొసళ్ళను తెంచి వేయడం ద్వారా గుడ్లను నాశనం చేయవచ్చు.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in